ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 29.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు విచారణకు హాజరు కావాలని మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసింది.

2. గాలి నాణ్యత కేవలం పర్యావరణ అంశం కాదని , అది ప్రజారోగ్యం , ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సూచీ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

3. గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని కేంద్ర మంత్రులు జువల్ ఓరమ్, కిషన్ రెడ్డి ఈరోజు మేడారం పర్యటనలో చెప్పారు.

4. మేడారం జాతరను జాతీయ పండగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి పలువురు రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి చేశారు.

**కేసీఆర్ నోటీస్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇవాళ మధ్యాహ్నం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన అధికారులు , కేసీఆర్ పీఏకు ఈ నోటీసులు అందజేశారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసులో

పేర్కొన్నారు. అయితే వయసు రీత్యా కేసీఆర్‌కు సిట్ వెసులుబాటు కల్పించింది. పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, హైదరాబాద్ పరిధిలో ఆయన కోరుకున్న చోటే విచారణ జరుపుతామని అధికారులు స్పష్టం చేశారు. సిఆర్‌పిసి సెక్షన్ 160 ప్రకారం ఈ నోటీసులు జారీ అయ్యాయి.

పిటిసి, హైదరాబాద్

**ఎయిర్ క్వాలిటీ**

పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ లో నిర్వహించిన "గాలి నాణ్యత సూచీ-గాలి నాణ్యత నిర్వహణ " సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గాలి నాణ్యత కేవలం పర్యావరణ అంశం కాదని, అది ప్రజారోగ్యం, ఉత్పాదకత, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సూచీ అని ఆయన అన్నారు. గాలి కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షలకు పైగా అకాల మరణాలు సంభవిస్తున్నాయని , ఆర్థికంగా భారీ నష్టం జరుగుతోందని తెలిపారు.

జీఎస్

**మేడారం కేంద్ర మంత్రులు**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈరోజు రెండో రోజుకు చేరుకుంది. ఈరోజు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జువల్ ఓరం , బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ... సమ్మక్క సారలమ్మ జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా, గిరిజనుల మహా కుంభమేళాగా నిలుస్తుందని అన్నారు. జాతర నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తోందని , భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా గిరిజన గ్రామాభివృద్ధి అభియాన్ కింద లక్ష కోట్ల రూపాయలు, పీఎం జన్ మన్ పథకం కింద 24 వేల

కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసినట్లు చెప్పారు.

సౌండ్ బైట్ - జువల్ ఓరం, కేంద్ర మంత్రి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ... ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, బొగత జలపాతాల పర్యాటకాభివృద్ధికి 80 కోట్ల రూపాయలు , రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్ల రూపాయలు , ఈ ఏడాది జాతర ఏర్పాట్లకు 3 కోట్ల 70 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. సమ్మక్క , సారలమ్మ పేరుతో 890 కోట్ల రూపాయల వ్యయంతో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని , దీనిని త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని తెలిపారు.

సౌండ్ బైట్ - కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి

పిటిసి, ములుగు

**జాతీయ పండుగ**

మేడారం సమ్మక్క , సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే పలుమార్లు కోరినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారంలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ , భక్తుల సౌకర్యం కోసం శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిని గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా , మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు. కేంద్ర మంత్రుల పర్యటనతో జాతీయ పండుగ గుర్తింపు అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీఎస్

**యాప్**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిర్యాదుల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం టీఈ-పోల్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికలకు

సంబంధించి సమస్యలుంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొంది. కమిషన్ వెబ్ సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని తెలియజేసింది.

డెస్క్

**వింగ్స్ ఇండియా**

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా ప్రదర్శన రెండో రోజు కొనసాగుతోంది. వివిధ దేశాలు , సంస్థలకు చెందిన విభిన్న రకాల విమానాలు , హెలికాప్టర్లు, పోర్టబుల్ ఫ్లైట్‌లు , వాణిజ్య విమానాలు వైమానిక ప్రదర్శనలో చేస్తున్న విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అలాగే, పలు ఏరో స్పేస్ సంస్థలు బిజినెస్ సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఎల్లుండి వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

జీఎస్

**మేడారం సమ్మక్క**

మేడారం జాతరలో కీలక ఘట్టం ఈరోజు ఆవిష్కృతం అవుతుంది. చిలుకల గుట్ట నుంచి వన దేవత సమ్మక్క గద్దెపైకి చేరుకుంటారు. సమ్మక్క వచ్చే సమయంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గాలిలోకి కాల్పులు జరపడం సంప్రదాయంగా వస్తోంది. మరింత సమాచారం మా కరస్పాండెంట్ ప్రతాప్ చెప్తారు.

**వాయిస్ కాస్ట్**

మేడారం మహా జాతర తొలి ఘట్టంలో నిన్న పగిడిద్ద రాజు , గోవిందరాజులు, సారలమ్మ గద్దెలకు చేరుకున్నారు. ఈరోజు రాత్రికి ముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతమవుతుంది. కోట్లాది మంది భక్తులు ఇలవేల్పుగా కొలిచే సమ్మక్క దేవత చిలకల గుట్ట నుండి గద్దెలకు చేరుకుంటారు. ఆదివాసీ సాంప్రదాయాలు , గొట్టు గోత్రాల పూజల మధ్య సమ్మక్క పూజారులు ఈరోజు సాయంత్రం చిలకల గుట్ట ప్రాంతంలోని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆదివాసీ పూజారులు కుంకుమ భరణి రూపంలో కంక కర్రతో పోలీసు రక్షణలో తీసుకొస్తున్న క్రమంలో అమ్మవారికి గౌరవ వందనంగా జిల్లా ఎస్పీ గాలిలోకి మూడు

రౌండ్ల కాల్పులు జరుపుతారు. దాంతో అమ్మ వారి గద్దెల ప్రయాణం సాగుతుంది. ఆ సమయంలో భక్తులు అమ్మవారికి ఎదురువెళ్లి మొక్కులు సమర్పిస్తారు. నలుగురు వనదేవతలు గద్దెలపై కొలువు దీరడంతో మేడారం జాతరలో అత్యంత కీలకమైన పండుగ రేపు జరుగుతుంది.

పీటీసీ, ములుగు

**భట్టి**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా ఈరోజు మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొని , నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మేడారం జాతరకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించిందన్నారు.

జీఎస్

**పొన్నం ప్రభాకర్**

హన్మకొండ జిల్లా , భీమ దేవరపల్లి మండలం , ములకనూరులో సమ్మక్క , సారలమ్మల జాతరలో అమ్మవార్ల ను మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు.

**పిటిసి, వరంగల్**

**వివేక్ వెంకటస్వామి**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం , అక్కేపల్లి గ్రామంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర అమ్మవార్లను కార్మిక , గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

**పిటిసి, మంచిర్యాల**

**సమ్మక్క, సారలమ్మ - జిల్లాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా  వ్యాప్తంగా పలు గ్రామాల్లో వెలిసిన సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.
మేడారం మహా జాతరకు అనుబంధంగా హన్మకొండ , వరంగల్ జిల్లాలలో మినీ మేడారం జాతరలకు భక్తులు పోటెత్తుతున్నారు.

**పిటిసి, సిరిసిల్ల/వరంగల్**

**కేటీఆర్**

బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు  తారక రామారావు  స్పందించారు.  ఇది విచారణ కాదని , ప్రతీకారమని, రాజకీయ దురుద్దేశమని విమర్శించారు. సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు.

డెస్క్

**కేంద్ర పథకాలు - రిజిస్ట్రేషన్**

కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే పీఎం కిసాన్ తో పాటు , ఇతర సబ్సిడీలు పొందడానికి రైతు లు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ తెలిపారు. వాంకిడిలో కొనసాగుతున్న రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి  కాని రైతులకు పీఎం కిసాన్ తో పాటు ఇతర కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలు కూడా వర్తించవని అన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**ఆక్రమణల తొలగింపుకు**

వరంగల్ లోని  భద్రకాళి  అమ్మవారి  ఆలయ పరిసరాల్లో ఆక్రమణలను తొలగించాలని , పేరుకుపోయిన చెత్తను వెంటనే క్లియర్ చేయాలని , ఫుట్‌పాత్‌ల సమీపంలోని పొదలను

తొలగించాలని  బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.    ఈరోజు ఆలయ పరిసరాల్లో ఆకస్మికంగా పర్యటించిన కమిషనర్ పలు సూచనలు చేశారు.

పిటిసి, వరంగల్

**స్పెషల్ డ్రైవ్**

రోడ్లు,  చెట్లు,  విద్యుత్ స్తంభాలు ,  నివాస ప్రాంతాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న నిషేధిత చైనీస్ మాంజాను తొలగించేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో కనిపించిన చైనా మాంజాను తొలగించారు. కేపీహెచ్‌బీ , మాదాపూర్, కూకట్‌పల్లి, మియాపూర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. గాలిపటాలు  , మాంజా విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. వీటిని వినియోగించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

డెస్క్

**దానం నాగేందర్**

అనర్హత పిటిషన్ కు సంబంధించి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జారీ చేసిన నోటీసులపై ఇప్పటికే తన న్యాయవాది సమాధానమిచ్చినట్లు ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ తెలిపారు.  తనను వ్యక్తిగతంగా హాజరుకావాలని స్పీకర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అన్నారు.

పిటిసి, హైదరాబాద్